శబరిమలకు అయ్యప్ప భక్తులు

ఇరుముళ్లతో శబరిమల వెళ్తున్న భక్తులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 7: అయ్యప్ప భక్తులు ఇరుముళ్లతో గురువారం శబరిమలకు బయల్దేరారు. ముందుగా, పట్టణంలోని నందమూరినగర్ కాలనీలో నిర్మాణంలోగల అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో ఇరుముళ్లు కట్టించుకున్నారు. వారిని కుటుంబీకులు, బంధుమిత్రులు సాగనంపారు.

కేసీఆర్ కాలనీలో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తనూజ

చంద్రుగొండ, డిసెంబర్ 7: చంద్రుగొండ గ్రామ శివారు కేసీఆర్ కాలనీలో గురువారం వైద్య శిబిరాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజ నిర్వహించారు. ఇంటింటికెళ్లి పారిశుధ్యాన్ని పరిశీలించారు. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించకపోతే దోమలు పెరుగుతాయని చెప్పారు.

యూడీఐఎస్ఈ ప్లస్‌లో వివరాలు ఉంచాలి

మణుగూరు టౌన్, డిసెంబర్ 7: యూడీఐఎస్ఈ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) పోర్టల్‌లో అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల వివరాలు పొందుపరచాలని ఎంఈవో వీరస్వామి పాఠశాలల నిర్వాహకులకు తెలిపారు. ఆయన గురువారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల వివరాలను ఈ నెల 12వ తేదీలోపు నమోదుచేయాలన్నారు.

సాయిబాబాకు పంచామృతాభిషేకం

భద్రాచలం, డిసెంబర్ 7: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయి మందిరంలో గురువారం ఉదయం బాబా వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, నూతన వస్త్రాలు, స్వర్ణాభరణాలను ధరింపజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి,హారతులు సమర్పించారు. పట్టణానికి చెందిన చిన్నాల సత్యనారాయణ,లక్ష్మి దంపతులు కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో అన్నదానం నిర్వహించారు. వారి కుమారుడు, కొడలును ఆలయ కోశాధికారి కుంచాల రమేశ్ శాలువాతో సత్కరించి, బాబా చిత్రపటాన్ని అందజేశారు.

భగవద్గీత కంఠస్థ పోటీలో ప్రథమ బహుమతి

గణేష్ కార్తికేయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జంగాల మంజుల

భద్రాచలం, డిసెంబర్ 7: గీతాజయంతి సందర్భంగా ఇటీవల ప్రపంచ స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థి త్రిపురనేని గణేశ్ కార్తికేయ ప్రథమ బహుమతి సాధించాడు. జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జంగాల మంజుల, ఏవో బాబురావు, వైస్ ప్రిన్సిపల్ విమలాదేవి, అకడమిక్ ఇన్‌చార్జి నరేశ్, క్యాంపస్ ఇన్‌చార్జి సందీప్ రెడ్డి, ఉపాధ్యాయులు గణేశ్‌ను అభినందించారు.

రేపు గోదావరికి నదీ హారతులు

భద్రాచలం, డిసెంబర్ 7: కార్తీకమాసం సందర్భంగా భద్రాచలంలోని సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో గోదావరి మాతకు శనివారం 'నదీ హారతులు' వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎల్.రమాదేవి తెలిపారు.

అశ్వారావుపేట టౌన్: కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

అశ్వారావుపేట రూరల్: వాగొడ్డుగూడెంలో నీట మునిగిన వరి కుప్పలు

అశ్వారావుపేట టౌన్: నీట మునిగిన పంట

కన్నీటి వర్షం

తమకు జీవనాధారమైన పంటంతా నీటిపాలయ్యాక.. ఆరుగాలం కష్టమంతా వరదలో కొట్టుకుపోయాక.. ఆ బాధిత రైతులకు మిగిలింది ఒక్కటే.. కన్నీటి వర్షం..!

అశ్వారావుపేట రూరల్: మల్లాయిగూడెంలో దెబ్బతిన్న రోడ్డు

దమ్మపేట: తడిచిన పంటను చూపుతున్న రైతులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 7: తుపాన్ వచ్చింది. రైతులకు అపార నష్టాన్ని, కన్నీటి వర్షాన్ని మిగిల్చి వెళ్లింది. రెండు రోజులపాటు కుండపోతగా కురిసిన వర్షానికి పంటలు మునిగాయి. ధాన్యపు కుప్పలు తడిచాయి. తుపాన్ తగ్గిందనుకుని తేలిగ్గా ఊపిరి తీసుకుంటున్న రైతులపై పిడుగు పాటులా కాలువలకు గండ్లు పడ్డాయి. బాధిత రైతుల గుండెలు కన్నీటి చెరువులయ్యాయి. వరి, వేరుశనగ, పత్తి, పొగాకు, మిర్చి పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది.

అశ్వారావుపేట, డిసెంబర్ 7: జంగారెడ్డిగూడెం పుగాకు బోర్డ్ పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, వందల ఎకరాల్లోనిది స్వల్పంగా దెబ్బతిన్నదని చైర్మన్ సీహెచ్ యశ్వంత్ తెలిపారు. బోర్డ్ పరిధిలోని జీలుగుమిల్లి, అశ్వారావుపేట మండలాల్లో దెబ్బతిన్న పుగాకు తోటలను గురువారం పరిశీలించారు.

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 7: మండలంలోని అంకమ్మ చెరువు అలుగు ఉధృతంగా పారుతుండడంతో వరి పొలాల్లోని కుప్పలు ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయి. కొన్ని గ్రామాల్లోగల ఫారం పాండ్‌లలోని చేప పిల్లలు కొట్టుకుపోయాయి. అశ్వారావుపేట-వాగొడ్డుగూడెం గ్రామాల మధ్య గురువారం కూడా రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. పండువారిగూడెం-వినాయకపురం మధ్య రోడ్డు అక్కడక్కడ దెబ్బతిన్నది.

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 7: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. దానిని రైతులు గురువారం ఆరబెట్టారు. కుప్పల అడుగున ఉన్న వడ్లు మొలకెత్తాయి.

అశ్వారావుపేట రూరల్: వాగొడ్డుగూడెం-అశ్వారావుపేట రహదారిపై వరద నీరు

అశ్వారావుపేట: దెబ్బతిన్న పుగాకు పంటను పరిశీలిస్తున్న బోర్డ్ చైర్మన్ యశ్వంత్

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

అశ్వారావుపేట, డిసెంబర్ 7: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, మంత్రులుగా భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు అశ్వారావుపేట, నారాయణపురం గ్రామాల్లో సంబురాలు చేసుకున్నారు. నాయకులు-ప్రజాప్రతినిధులు చిన్నంశెట్టి సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, అట్టం రమ్య, మొగళ్ళపు చెన్నకేశవరావు, రేమళ్ళ కేదార్‌నాథ్, చందా సతీష్, కానూరి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నైపుణ్య శిక్షణ

టేకులపల్లి, డిసెంబర్ 7: మండలంలోని సులానగర్ గ్రామంలో మహిళలకు ఉచిత నైపుణ్య శిక్షణా శిబిరాన్ని గురువారం స్ట్రీట్ కాజ్ కేఎంఐటీ ఏర్పాటు చేసింది. దీనిని నిర్వాహకురాలు దేదీప్య, ఉప సర్పంచ్ ఉండేటి బసవయ్య ప్రారంభించారు. శిక్షకులు మార్త, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గెలిచినా, ఓడినా ప్రజలతోనే : హరిప్రియ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

బయ్యారం/గార్ల, డిసెంబర్ 7: ప్రజా తీర్పును స్వాగతిస్తున్నామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం, గార్లలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాలేదని, అయినప్పటికీ ప్రజల తీర్పును తాము గౌరవిస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఎల్లప్పుడూ తమ బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షానే ఉంటుందని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్ర అభివృద్ధిలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో నేడు ప్రజల పక్షాన నిలబడతామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, భవిషత్ బీఆర్ఎస్‌దేనని అన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.600 కోట్ల నిధులు పలు అభివృద్ధి పనుల నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో మంజూరైనందున వాటిని పూర్తి చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు తాతా గణేశ్, గంగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.